


# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక




సంపుటి: 01 సంచిక : 261. ఎడిటర్ : సింగిడి అమృత్ తెలంగాణ శనివారం.05.07.2025 పేజీలు:4, వెల:రూ.1.00

# దేశంలో 11 ఏండ్లుగా ఎమర్జెన్సీ

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: దేశంలో 11 ఏండ్లుగా ఎమర్జెన్సీ పరిస్థితులున్నాయనీ, దీనిపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 ఏండ్ల క్రితం జరిగిన ఎమర్జెన్సీపై బీజేపీ మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. మ్యానిఫెస్టో అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. హామీలను అమలు చేసే ఏకైక పార్టీగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. తెలంగాణలో పరిపాలన, పార్టీ కార్యకర్తల పనితీరు బాగుందని కితాబిచ్చారు. పార్టీ పదవుల్లో ఉన్నవారు ఆ హౌదాలను సద్వినియోగం చేసుకోవా లని కోరారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన సమర్థులకే పదవులు ఇవ్వాలని మహేశ్ కుమార్ గౌడ్‌కు సూచించారు. పార్టీ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడొద్దనీ, పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి ఒకే తాటిపై నిలవాలని దిశానిర్దేశం చేశారు. మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని తెలిపారు. అగ్రకులాలకు సీఎం, బీసీకి పీసీసీ అధ్యక్షునిగా, క్యాబినెట్‌లో నలుగురు దళితులు, స్పీకర్‌గా మరో దళితునికి అవకాశమిచ్చిందని ఉదహరించారు. రాష్ట్రంలో మరోసారి 90 సీట్లతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి కులగణన చేయడంలో విజయం సాధించినట్టు తెలిపారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో చాలా విజయాలు



సాధించినట్టు చెప్పారు. తాను పీసీసీ అధ్యక్షునిగా ఉన్న సమయంలో 45 లక్షల మంది క్రియాశీలక సభ్యత్వం చేసుకున్నామని తెలిపారు. పార్టీ పదవులను తేలిగ్గా తీసుకోవద్దనీ, అవి రాజకీయాల్లో ఎదుగుదలకు ఉపయోగ పడతాయని అన్నారు. నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కాబోతున్నాయనీ, నాయకులుగా ఎదగాలంటే ఇప్పటి నుంచే కష్టపడాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాధన్ తదితరులు పాల్గొన్నారు.

# వరద బీభత్సం.. 24 మంది మృతి

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రాన్ని భారీ వరదలు ముంచెత్తాయి. గత కొద్ది రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. ఈ జల ప్రళయంలో ఓ క్రిస్టియన్ సమ్మర్ క్యాంపు నుంచి 20 మందికి పైగా బాలికలు గల్లంతవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రకృతి విపత్తులో ఇప్పటివరకు మొత్తం 24 మంది మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు.



వివరాల్లోకి వెళితే.. టెక్సాస్‌లోని హంట్ ప్రాంతంలో ప్రవహించే గ్వాడాలుపే నది కుండపోత వర్షాలకు ఉగ్రరూపం దాల్చింది. నది ఉప్పొంగడంతో దాని తీరంలో ఏర్పాటు చేసిన ఓ ప్రముఖ క్రిస్టియన్ క్యాంపును వరద నీరు పూర్తిగా ముంచెత్తింది. వేసవి శిక్షణా శిబిరం కోసం అక్కడికి వచ్చిన 23 నుంచి 25 మంది బాలికలు వరద ప్రవాహంలో గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. దీంతో తమ పిల్లల ఆచూకీ తెలియక తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చిన్నారుల ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ కన్నీరుమున్నీరవుతున్నారు.

మరోవైపు అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. వరదల్లో చిక్కుకున్న సుమారు 200 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గల్లంతైన బాలికల కోసం హెలికాప్టర్లు, పడవల సాయంతో ముమ్మరంగా గాలిస్తున్నారు. నది ఉద్ధృతి, ప్రతికూల వాతావరణం సహాయక చర్యలకు ఆటంకంగా మారినట్లు తెలుస్తోంది. భారీ వరదల కారణంగా అనేక నివాసాలు నీట మునిగి, లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి.

# మోడీవన్నీ అబద్ధాలే..

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ప్రధాని నరేంద్రమోడీ చెప్పేవన్నీ అబద్ధాలేనని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఆయన చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతనే ఉండదని తీవ్రంగా విమర్శించారు. ఉగ్రవాదంపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాని ఎందుకు రాలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. 42 దేశాల్లో పర్యటించిన ఆయనకు స్వదేశంలోని మణిపూర్ రాష్ట్రాన్ని సందర్శించే తీరిక, ధైర్యం లేవని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలను రోడ్ల పాలు చేసి విదేశీ నాయకులను కౌగిలించుకు ంటున్న మోడీ, కేంద్ర హౌంమంత్రి అమిత్‌షా ఢిల్లీ వదిలి పారిపోయే రోజు వస్తుందని హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన సామాజిక సమరభేరి సభలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు.

ప్రతిపక్ష పార్టీలతో సహా యావత్ దేశం ఒక్కటిగా నిలబడిప్పటికీ ఆపరేషన్ సిందూర్‌ను మధ్యలో ఎందుకు ఆపారని ప్రశ్నించారు. పెహల్గాం ఉగ్రదాడి తర్వాత ఉగ్రవాదాన్ని అంతం చేస్తామంటూ పాకిస్తాన్‌పై యుద్ధం ప్రకటించిన సర్కార్ వెనుకడుగు వేసిందన్నారు. భారతదేశం, పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని మధ్యవర్తిత్వం ద్వారా తానే ఆపానని అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించుకుంటే ప్రధాని ఆ వ్యాఖ్యల్ని ఎందుకు ఖండించలేదని తప్పుపట్టారు. ప్రధాని మోడీకి బీహార్ ఎన్నికల ప్రచారంపై ఉన్న ఆసక్తి దేశాన్ని కాపాడటంలో లేదని విమర్శించారు. పాకిస్తాన్‌ను రెండు ముక్కలు చేసిన ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాంధీది అనీ, ఆమెపై ఎన్ని వత్తిళ్లువచ్చినా లొంగకుండా బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం అందించారని గుర్తుచేశారు. దేశభక్తి అంటే ఇందిరాగాంధీ చూపించిన తెగువేనన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం, అనంతరం దేశ నిర్మాణం కోసం కాంగ్రెస్, గాంధీ కుటుంబం అనేక త్యాగాలు చేసిందని తెలిపారు.

నాడు, నేడు ఆర్ఎస్ఎస్, బీజేపీలు దేశం కోసం ఏం త్యాగాలు చేశాయని ప్రశ్నించారు. రాజ్యాంగంలో సోషలిజం, సెక్యులరిజం పదాలు లేకుండా చేస్తామనీ బీజేపీ బీరాలు పలుకుతున్నదనీ, వాటి జోలికొస్తే కాంగ్రెస్ చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు. మోడీ సర్కార్ విదేశీ విధానం శత్రువులను పెంచే విధంగా ఉ ందనీ, ఇప్పటికే చైనా, పాకిస్తాన్‌తో శత్రుత్వం ఉందన్నారు. ప్రస్తుతం నేపాల్ కూడా భారతదేశానికి దూరంగా జరుగుతున్నదని చెప్పారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో హైదరాబాద్‌కు 50కి పైగా ప్రతిష్టాత్మక కేంద్ర సంస్థలను తీసుకొచ్చిందనీ, ఈ నగరానికి బీజేపీ ఏ చేసిందో స్పష్టం చేయాలని అన్నారు. మణిపూర్‌లో ప్రజలకు ధైర్యాన్ని కల్పించేందుకు రాహుల్‌గాంధీ ఆ రాష్ట్రంలో పర్యటించారని గుర్తు చేశారు. మోడీ ఎందుకు ఆ రాష్ట్రంలో కాలుపెట్టలేక పోతున్నారని ప్రశ్నించారు. భారత దేశ



ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అందరం ఒక్కటిగా ముందుకు కదులుదామని ఆయన పిలుపునిచ్చారు.

తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వాన్ని కూలదోయడం అసాధ్యమనీ, బీజేపీ బలపడుతుందే తప్ప కాంగ్రెస్‌కు అవకాశం లేదన్న పరిస్థితులను హస్తం కార్యకర్తలు తారుమారు చేశారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే ఆత్మ అని అన్నారు. అర్థబలం ఉండి, స్థిరంగా పాతుకుపోయినట్టు కనిపిం చిన గత బీఆర్ఎస్ సర్కార్‌ను, కేంద్రంలో అప్పటికే అధికారంలో ఉన్న బీజేపీని కాదని తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను గెలి పించారనీ, ఈ విజయంలో కార్యకర్త ల కష్టం ఉందని చెప్పారు. రాష్ట్రంలో పేదలు, రైతు లు, యువత, మహి ళలు అన్ని వర్గాల కోసం అనేక సంక్షేమ, ఉద్యోగ, ఉపాధి కార్యక్రమాలు అమలు చేస్తు న్నామని వివరించారు.

కాంగ్రెస్ చెప్పిందే చేస్తుందనీ, దానిలో భాగంగానే గిగ్ వర్కర్ల కోసం చట్టం రూపొందించామని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం బాగా పని చేస్తున్నదని ప్రశంసించారు. రాష్ట్రంలో కులగణన చేయటం ద్వారా దేశంలో అనివార్యంగా కులగణన చేసే పరిస్థితిని కాంగ్రెస్ సృష్టించిందని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం కాంగ్రెస్ పోరాడుతుంద న్నారు. పార్టీకి మరింత బలాన్నిచ్చి, సామాజిక న్యాయ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. సభకు టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షత వహించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్, రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నేత దారుణ హత్య

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: బీజేపీ నేత, ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కాను దుండగులు కాల్చి చంపారు. సరిగ్గా మూడేళ్ల క్రితం ఆయన కుమారుడు గుంజన్ ఖేమ్కా కూడా ఇలాగే హత్యకు గురయ్యారు. ఒకే కుటుంబంలో తండ్రీకొడుకులు హత్యకు గురవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బీహార్ రాజధాని పాట్నాలో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. గాంధీ మైదాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 'పనాచే' హోటల్ సమీపంలో ఉన్న 'ట్విన్ టవర్' అపార్ట్‌మెంట్‌లో గోపాల్ ఖేమ్కా నివాసం ఉంటున్నారు. ఆయన ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆయనపై కాల్పులు జరిపి పరారయ్యారు. ఈ ఘటనలో ఖేమ్కా అక్కడికక్కడే



ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సిటీ ఎస్పీ సెంట్రల్ దీక్ష మాట్లాడుతూ, "గోపాల్ ఖేమ్కా హత్యకు గురైనట్టు మాకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆ ప్రాంతాన్ని మా ఆధీనంలోకి తీసుకున్నాం. ఒక బుల్లెట్, షెల్ కేసింగ్‌ను స్వాధీనం చేసుకున్నాం. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తూ దర్యాప్తు చేస్తున్నాం" అని వివరించారు. హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

# రాష్ట్రంలో నియోజకవర్గాలు పెరగబోతున్నాయి: సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్: అమృత్ తెలంగాణ: ఇప్పటి వరకు అన్ని ఎన్నికల్లో కార్యకర్తలు తమను గెలిపించారని.. ఇక వచ్చే స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలను, స్థానిక నాయకులను గెలిపించే బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి సభలో సీఎం మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీకి 119గా ఉన్న సీట్లు 150కిపైగా అవుతాయని.., పార్లమెంట్ సీట్లు కూడా పెరగబోతున్నాయని.. మహిళలకు రిజర్వేషన్లు అమలు కానున్నాయని చెప్పారు. అంతే కాకుండా ఐదారుగురు మంత్రులుగా వచ్చే అవకాశం కూడా ఉందన్నారు. కార్యకర్తలకు అన్ని పదవులు

దక్కే వరకూ విశ్రాంతి తీసుకోబోనని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో 100 అసెంబ్లీ సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని.. దాని కంటే ఒక్క సీటు తక్కువ వచ్చినా తనదే బాధ్యతని చెప్పారు. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం..

తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. 20 మంది విద్యార్థులు ఉంటే చాలు.. ఆ ఏరియాలో ప్రభుత్వ పాఠశాల లేనట్టైతే వెంటనే ప్రాథమిక పాఠశాలను ప్రారంభించాలని ఆదేశించింది. మొదటి విడతలో 94 స్కూల్స్ పట్టణ ప్రాంతాల్లో, 63 ప్రైమరీ స్కూల్స్ గ్రామీణ ప్రాంతాల్లో వెంటనే ప్రారంభించాలని ఆదేశించింది. 20 కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న ప్రభుత్వ / స్థానిక సంస్థల పాఠశాల అందుబాటులో లేని గ్రామీణ ఆవాసాలు / పట్టణ కాలనీలు / వార్డుల లో ప్రైమరీ స్కూల్స్ అందుబాటులో

ఉన్న ప్రభుత్వ గృహాలలో లేదా అద్దె వసతి గృహాలలో పాఠశాలలను వెంటనే ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని డిఇఓ లకి ఆదేశాలు జారీ చేసింది. ఫర్నిచర్, స్టేషనరీ, విద్యా సామగ్రి, ఇతర వస్తువులకు అవసరమైన బడ్జెట్‌ను డీఎస్ఈ ద్వారా జిల్లా కలెక్టర్లకు విడుదల చేయనుంది. 212 గ్రామీణ ఆవాసాలలో 359 పట్టణ కాలనీలు / వార్డులలో ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు కానున్నాయి. మొత్తం 571 కొత్త ప్రైమరీ స్కూల్స్ అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో పేద విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉండనున్నది.

# రైతు రాజ్యం పైచర్చకు సిద్ధం

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రైతు రాజ్యం ఎవరిదో తేల్చుకునేందుకు చర్చకు సిద్ధమని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. అటు పార్లమెంట్, ఇటు అసెంబ్లీలో ఎక్కడికైనా సరే, ప్రధాని మోడీ, మాజీ సీఎం కేసీఆర్ ఎవరొచ్చినా చర్చకు తాము సిద్ధమని తేల్చిచెప్పారు. రైతు భరోసా పథకం ఎప్పుడు విఫలమవుతుందోనని కొందరు గోతికాడి నక్కల్లా ఎదురు చూశారని అన్నారు. కానీ కేవలం 9 రోజులల్లోనే రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేశామని గుర్తు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక సమరభేరి సభలో ఆయన మాట్లాడారు. కల్వకుంట్ల కోటలను కాంగ్రెస్ కార్యకర్తలు బద్దలు కొట్టారని అన్నారు. కార్యకర్తల కష్టం ఫలితంగానే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ఇదే ఎల్బీ స్టేడియంలో ఇంది రమ్మ రాజ్యం ఏర్పడిందని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం మూణ్ణాళ్ల ముచ్చటేననీ, సంక్షేమ పథకాలు ఎక్కువ రోజులు అమలు చేయలేరం టూ విమర్శలు చేశారని తెలిపారు. కాంగ్రెస్ వాళ్లు కలిసి ఉండలేరనీ, వాళ్లలో వాళ్లే కొట్టుకుం టున్నారని ప్రచారం చేశారనీ, కానీ నవ్వినోడి ముందే తలెత్తుకునేలా పాలన చేస్తున్నామని అన్నారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే కుల గణన చేసి సామాజిక న్యాయానికి శ్రీకారం చుట్టామన్నారు. తెలంగాణలో దెబ్బతిన్న వ్యవస్థలను పునరుద్ధరించుకుంటూ ముందుకు సాగుతున్నామని అన్నారు. కలిసికట్టుగా ముందు కెళ్తూ అందరి అపోహలు పటాపంచలు చేశామని తెలిపారు. తెలంగాణలో తమకు తిరుగులేదని విర్రవీగిన బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టామని చెప్పారు.

గొర్రెలు, బర్రెలు కాచుకోవాలా?

వందలాది మంది బలిదానంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత యువత ఉద్యోగాలు అడిగితే కేసీఆర్ గొర్రెలు, బర్రెలు పెంచుకోమన్నారని ఆవేదన వ్యక్తం చేవారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. అందులో ఒక్కటి తప్పినా తాను వారి కాళ్లు పట్టుకుని క్షమాపణ చెబుతానన్నారు. ఉద్యోగ నియామకాలపై చర్చకు వచ్చేందుకు కేసీఆర్, కిషన్‌రెడ్డికి



దమ్ముందా? అని సవాల్ విసిరారు. పథకాలకు ఇందిరమ్మ పేరు పెడితే కొందరు రాద్ధాంతం చేస్తున్నారనీ, ఆమె గొప్పతనం వారికి తెలిసేలా చెప్పాల్సింది కాంగ్రెస్ కార్యకర్తలేనని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, సన్న బియ్యం వంటి అనేక హామీలు అమలు చేస్తున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల కష్టాలు, ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకుని ముందుకెళు తున్నామని చెప్పారు.

బీఆర్ఎస్‌పై యుద్ధమే..

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను, చేస్తున్న అభివృద్ధిపై తాము విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. పార్టీ కార్యకర్తలు ఆపని చేయాలని దిశానిర్దేశం చేశారు. దుబారు నుంచి బీఆర్ఎస్ సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు సోషల్ మీడియాలో ఆ పార్టీపై యుద్ధం ప్రకటించాలని పిలుపునిచ్చారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోరాడండి

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పోరాడాలని చెప్పారు.

# ఎమ్మెల్యే పాయల్ శంకర్ మీడియా సమావేశం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసినతగా ఏ పార్టీ మోసం చేయలేదులి మా రాష్ట్ర అధ్యక్షుడిని విమర్శించే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉంది. రాష్ట్ర ప్రభుత్వం బీసీ లకు ఇచ్చిన పదవులు ఎన్ని దేశంలో ప్రధానమంత్రి బీసీ కాకుండా కేంద్ర క్యాబినెట్లో బీసీ లకు మంత్రి పదవులు ఇచ్చిన ఘనత నరేంద్రమోడీ ది. భారతదేశం అంతా కూడా కాంగ్రెస్ పార్టీ తుడుచుకు పెట్టీ పోయింది. కనీసం దేశంలో ప్రతిపక్ష హోదా కూడా ప్రజలు ఇవ్వలేకపోయారు. ఇవన్నీ TPCC చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలుసుకుంటే బాగుంటది. నామినేట్ పదవులు ఈ రాష్ట్రంలో బీసీలకు ఎందుకు ఇవ్వడం లేదు, నీ మంత్రివర్గంలో ఎంతమంది బీసీలు ఉన్నారు మహేష్ కుమార్ గౌడ్ గారు మీరు భారతీయ జనతా పార్టీని విమర్శించడం అంటే ఆకాశం మీద ఉమ్మి వేయడమే. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎంతమందికి మీరు బీసీలకు టికెట్ ఇచ్చారు పార్లమెంట్లో ఎందరి మందికి టికెట్లు ఇచ్చారు తెలుసుకోండి ముందు రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రామచంద్ర రావు గారు 40 సంవత్సరాల నుండి రాజకీయాలు ఉన్నారు, సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి అలాంటి వ్యక్తి గురించి విమర్శలు సరికాదు. ముందు మీ ఇల్లు సక్క పెట్టుకోండి తర్వాత ఇతర పార్టీల గురించి విమర్శించండి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి మార్చుకునే సంప్రదాయం ఉన్న పార్టీ, ముందు బీసీని ముఖ్యమంత్రిని చేయండి ఇతరుల గురించి మాట్లాడండి. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు ఆకుల ప్రవీణ్ రఘుపతి.




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభ్యులు పాయల్ శంకర్

లాలమున్న. జోగు రవి కృష్ణ యాదవ్. భరత్. భీమ్ సేన్ రెడ్డి. ముకుందరావు. సురే కిరణ్ రాందాస్ రాజన్న వినోద్. వెంకట్ రెడ్డి రమేష్ తదితరులున్నారు

# హైదరాబాద్ కాంగ్రెస్ మీటింగ్ లో పాల్గొన్న అదిలాబాద్ ఓ బి సి చైర్మన్ అంబకంటి అశోక్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : హైదరాబాద్ LB స్టేడియం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుపబడిన గ్రామకమిటీ అధ్యక్షులు మరియు క్రియాశీలకార్యకర్తలసమ్మేళనంలో భాగంగా ఏర్పాటుచేసిన సామాజిక న్యాయ సమరభేరి సభకు అదిలాబాద్ జిల్లా పట్టణము నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులైన తాజా మాజీ కౌన్సిలర్ (. ఓబీసీ జిల్లా చైర్మెన్)అంబకంటి అశోక్ కుమార్ తోపాటు సంజయ్ దుబే,మాజీ కౌన్సిలర్అశోక్ గౌడ్,మాజీసర్పంచ్ రామారావు పాల్గొనడం జరిగింది ఈ కార్యక్ర మానికి ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే తో పాటు కేసి వేణుగోపాల్ మరియు పార్టీవ్యవహారాలఇన్చార్జి మీనాక్షి నటరాజన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాటుఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిసిసిఅధ్యక్షులు మహేష్



మీటింగ్ లో పాల్గొన్న ఓబీసీ జిల్లా అధ్యక్షులు తాజా మాజీ కౌన్సిలర్ అంబకంటి అశోక్ మరియు కాంగ్రెస్ నాయకులు

కుమార్ గౌడ్ పాటు రాష్ట్ర మంత్రివర్యులతోపాటు ఎమ్మెల్సీ నాయకులు పాల్గొన్నారు

# విద్యాసంస్థల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధిజిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని వివిధ రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్యా , మౌలిక సదుపాయాల పరిరక్షణపై ప్రత్యేక దృష్టితో ఈ తనిఖీలు చేపట్టారు. మొదటగా, గిరిజన సంక్షేమ బాలురు పాఠశాల, కళాశాల (%ఙఔ=జీజ%) ను సందర్శించి తరగతుల గదుల్లో విద్యార్థులు చదువుతున్న తీరును పరిశీలించారు. అలాగే డార్మెటరీలు, టాయిలెట్లు తదితర వసతుల పై . ఆరా తీశారు. అవసరమైన అభివృద్ధి పనులపై అక్కడి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం అనుకుంట మున్సిపల్ పరిధిలోని మహాత్మ జ్యోతిబా పులే తెలంగాణ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల (MJPTBCWR) ను తనిఖీ చేశారు. అక్కడ డ్రెయినేజ్ సమస్యలు, రోడ్డు సదుపాయాల లేకపోవడం, వీధి దీపాల లేమి వంటి అంశాలను గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించి తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.తదనంతరం తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ , కళాశాల ను కూడా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు అందుతున్న వసతులు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఈ తనిఖీల నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ విద్యార్థుల భద్రత, అభ్యాసం, మౌలిక వసతుల మెరుగుదల కోసం అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని, అవసరమైన చర్యలు వేగంగా చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ శ్రీ రాజర్షి షా గారు శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ముఖ్యమైన రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మొదటగా గిరిజన సంక్షేమ బాలురు పాఠశాల కళాశాల (TWRJC) తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థులతో మాట్లాడారు. “మీరు ఎలా చదువుతున్నారు?”, “ఇక్కడ సౌకర్యాలు సరిపోయాయా?”, “అధ్యాపకులు పాఠాలు బాగా చెప్తున్నారా?” వంటి ప్రశ్నలు అడిగి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ లోనూ కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. వారికి లభిస్తున్న భోజన విధానం,

అధ్యాపకుల సహకారం, గ్రంథాలయ వనరుల గురించి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ “మీరు దేశ భవిష్యత్తు. మీరు బాగా చదవాలి. ఏ సమస్యైన ధైర్యంగా చెప్పాలని , నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఆయా విద్యా సంస్థల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

# అటవీ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలి - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : జిల్లాలోని మారుమూల అటవీ, గిరిజన ప్రాంతాల ప్రజలకు రవాణా, మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ కమిటీ (DLC) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అటవీ, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు. మొత్తం 16 రహదారి ప్రాజెక్టులపై ఈ సమావేశంలో చర్చించగా, అందులో 9 ప్రాజెక్టులకు అటవీ అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన 7 ప్రాజెక్టుల విషయంపై డాక్యుమెంటేషన్, నివేదికలు పూర్తి చేయాల్సిన కారణంగా పరిశీలనను వాయిదా వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అటవీ చట్టాలను



పాటిస్తూ గ్రామాల మధ్య రహదారి కనెక్టివిటీ, విద్యుత్, ఆరోగ్య సేవలు వంటి మౌలిక వసతుల కల్పనపై ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రాజెక్టులు చేపట్టే ముందు పరివేశ్ పోర్టల్ ద్వారా అటవీ అనుమతులకు సంబంధిత శాఖలు దరఖాస్తు చేయాలని, అవసరమైన మ్యాపులు, డీపీఆర్‌లు సమగ్రంగా సమర్పించాలని సూచించారు. అలాగే కడెం మండలం మైసం పెట్ గ్రామాన్ని పునరావాస గ్రామంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి మని ప్యాకేజ్, అటవీ హక్కుల చట్టం కింద సాగు భూములకు పట్టాలు అందించే ప్రక్రియను ప్రారంభించామని పేర్కొన్నారు. పునరావాస గ్రామంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, అటవీ అధికారులు నాగిని భాను, రేవంత్ చంద్ర, ఆర్డీవో రత్న కల్యాణి, ఆర్ అండ్ బీ ఈఈ నర్సయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ సాలియ నాయక్, గిరిజన సంక్షేమ అధికారి అంబాజి, ఏడీ ఎస్ఎల్ఆర్ సుదర్శన్, తహసీల్దార్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రివర్యులు జోగు రామన్న ఎస్టీ భవన్ లో జన్మదిన వేడుకలు



మాజీ మంత్రివర్యులు జోగు రామన్నజన్మదిన గజమాలతో శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ తాజా సర్పంచ్ పసుల గంగాధర్




రక్తదానం చేస్తున్న జందాపూర్ గ్రామం బి ఆర్ఎస్ నాయకులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : మాజీ మంత్రివర్యులు జోగు రామన్న ఎస్టీ భవన్ లో జన్మదిన వేడుకలు జన్మదిన వేడుకల సందర్భంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి నా శిరస్సు వంచి నమస్కరిస్తున్న అదే విధంగా నా జన్మదిన సందర్భంగా ప్రత్యక్షంగా పరోక్షంగా మరియు సామాజికి మాధ్యమాల ద్వారా శుభాకాంక్షలు తెలిపిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్ జోగు మహేందర్ తెలిపారు అదిలాబాద్ మండలం జందాపూర్ గ్రామం తాజా మాజీ సర్పంచ్ పసుల గంగాధర్ ఆధ్వర్యంలో జోగు రామన్న మాజీ మంత్రి జోగు రామన్న కు గజమాలతో సత్కారం మరియు జోగు రామన్న జన్మదిన సందర్భంగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించడం జరిగింది క్యాంపులో పాల్గొన్న జందాపూర్ బి ఆర్ఎస్ నాయకులు పసుల గంగాధర్ కె దేవిదాస్ చిలుకూరు కిష్టన్న రక్తదానం చేశారు ఈ కార్యక్రమంలో ఎల్టి మహేందర్ రెడ్డి పి మధుకర్ మీసాల స్వామి రాళ్లమడి అనిల్ జందాపూర్ గ్రామం నుండి పెద్ద ఎత్తున వచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు

# ఘనంగా మాజీ సీఎం రోశయ్య జయంతి వేడుకలు

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ డా. కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు శుక్రవారం కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు, కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాష్ట్ర రాజకీయాల్లో నాలుగు దశాబ్దాలకు పైగా రోశయ్య సేవలు నిరూపితమైందని, ఒక నిస్వార్థ సేవాభావంతో కూడిన నాయకుడు. పదవులు కోసం కాక, పరిపాలన కోసం జీవించిన మహనీయుడన్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చి అసాధారణ నాయకుడిగా ఎదిగిన రోశయ్య, స్వచ్ఛత,



పరిపాలనలో నిబద్ధతకు గుర్తుగా నిలిచారన్నారు. ఆయన పాలన అనుభవం, ఆర్థిక మేధస్సు, రాజకీయ నైపుణ్యం తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల చరిత్రలో చిరస్మరణీయంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు నరసింహ రెడ్డి, రమణ, సరోజ, విష్ణువర్ధన్, శ్రీకాంత్ రెడ్డి, రాజేశ్వర్ గౌడ్, ఇతర శాఖల అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# మానవాళికి తరువులే గురువులు..

జడ్చర్ల: అమృత్ తెలంగాణ: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గంగాపూర్ నందు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, జడ్చర్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చెట్లను పెంచి పర్యావరణ కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డీఈవో విద్యార్థులకు సూచించారు. చెట్లు బతికినన్ని రోజులు నీడనిచ్చి పూలనిచ్చి ఫలములు ఇచ్చి, చనిపోయిన తర్వాత కూడా చెట్లు మానవాళికి ఉపయోగపడుతున్నాయని అన్నారు.అవి మనందరికీ గురువు లాంటివని జడ్చర్ల సిఐ కమలాకర్ సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంతప్ప మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటినుంచి చెట్లను కాపాడడం, ప్రకృతిని కాపాడడం తమ బాధ్యతగా భావించాలని అన్నారు. దాదాపు పదివేల రూపాయల విలువ గల చెట్లను నాటడానికి ముందుకు వచ్చిన కరాటే మాస్టర్ కేశవులును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ సీఎంఓ బాలు యాదవ్ పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అందరూ పాల్గొన్నారు.



# కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు నిర్వహించారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య శ్రామిక ప్రజల హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడని, ఆయన ఆదర్శాలను నేటి తరం భావిప్రజలకు పరిచయం చేయాల్సిన అవసరంఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా అధికారులు నరసింహ రెడ్డి, రమణ, సరోజ, విష్ణువర్ధన్, శ్రీకాంత్ రెడ్డి, రాజేశ్వర్ గౌడ్, ఇతరశాఖలఉద్యోగులు, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సరస్వతీ పార్క్ శుభ్రం.. కాలనీ వాసుల ఆనందం

జడ్చర్ల: అమృత్ తెలంగాణ: జడ్చర్ల పట్టణంలోని 3వ వార్డులోని సరస్వతి నగర్ పార్క్ గత కొన్ని సంవత్సరాలుగా చెట్లపొదలు, మురుగునీరుతో నిండి ఉంది. అందులో పాములు పందులు విచ్చలవిడిగా ఉండడంతో చుట్టుపక్కల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. దీంతో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ నరేష్ కలిసి జెసిబి సహాయంతో పార్క్, చెట్ల పొదలను తొలగించారు. మురుగునీరు వెళ్ళేందుకు సరైన మార్గాన్ని చేశారు. దీంతో పార్కు మొత్తం శుభ్రంగా తయారయింది.

# ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మంచి విద్యను అందించాలి: కలెక్టర్



భువనగిరి :అమృత్ తెలంగాణ: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు మంచి విద్యనభ్యసించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం భువనగిరి మండలంలోనీ అనంతారం మైనారిటీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలలో టీచర్స్ , లెక్చరర్స్,సిబ్బంది యొక్క అటెండెన్స్ రిజిస్టర్ ను పరిశీలించారు. విద్యార్థులకు సాయంత్రం అందించే స్నాక్స్ ని పరిశీలించారు. హాస్టల్ కిచెన్ ను తనికి చేసి నూతన మెనూ ప్రకారం విద్యార్థులకి భోజనం పెడుతున్నారా లేదా అని హాస్టల్ వార్డెన్ ని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందజేయాలన్నారు. కిచెన్ లో నిల్వ ఉన్న కూరగాయలను వెంటనే తీసివేసి, కూరగాయలు ఎప్పటికపుడు తాజాగా తెచ్చి వండాలని అన్నారు. పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయా లేవా అని సంబంధిత అధికారిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని చెపుతూ ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులకు తెలియజేస్తూ అడ్మిషన్ లు పెరిగేలా చూడాలని అన్నారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

# కలెక్టర్ సుడిగాలి పర్యటన..



నల్లగొండ :అమృత్ తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం జిల్లాలో ఉన్న పలు సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలను, కళాశాలలను సందర్శించి రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, గిరిజన సంక్షేమ, మైనార్టీ సంక్షేమ, బాలుర ,బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను ఆమె ప్రత్యక్షంగా సందర్శించి ఆయా పాఠశాలలు, కళాశాలలో ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అంతేకాకుండా కావలసిన మౌలిక సదుపాయాల వివరాలను సేకరించారు . ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ ముందుగా గుండ్లపల్లి( డిండి) మండల కేంద్రంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి మౌలిక సదుపాయాల వివరాలు కనుకున్నారు. ఆ తర్వాత చందంపేట గిరిజన బాలికల మినీ గురుకులాన్ని సందర్శించి అక్కడ కూడా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత దేవరకొండలో ఉన్న తెలంగాణ గిరిజన బాలికల గురుకుల ప్రతిభా పాఠశాల/ కళాశాల, గిరిజన బాలుర గురుకుల పాఠశాల/ కళాశాల, కొండభీమనపల్లి వద్ద ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల/ కళాశాల, అలాగే తెలంగాణ బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, అవసరమైన మౌలికవసతులను పరిశీలించారు. ఆ తర్వాత కొండమల్లేపల్లిలో సైతం తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో, తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో ,మహాత్మ జ్యోతిబాపూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో మాలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నల్గొండ జిల్లా కేంద్రంలో సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల రెసిడెన్షియల్ పాఠశాల/ కళాశాలల్లో, బిసి గర్ల్స్ హాస్టల్, జీవీ గూడెం లో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించి అక్కడ ఉన్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. కాగా ఆయా పాఠశాలలు, కళాశాలల్లో అవసరమైన అదనపు బ్లాకులు, విద్యార్థులకు టాయిలెట్లు, బాత్రూంలు, డ్యూయల్ డేస్కులు, తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, మంచాలు,తదితర అవసరాలను అడిగి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో తాగునీటి ఓహెచ్ఎస్ఆర్ లు కావాలని, అదనంగా టాయిలెట్ బ్లాకులు కావాలని, డార్మెటరీ కావాలని ,కాంపౌండ్ వాల్, బాత్రూంలు, సోలార్ ఫెన్సింగ్, డ్యూయల్ డెస్కులు, రెసిడెన్షియల్ బ్లాక్లులు, మంచాలు కావాలని జిల్లా కలెక్టర్ తో ఆయా కళాశాలల, పాఠశాలల ప్రిన్సిపల్స్ తెలియజేశారు. జిల్లా కలెక్టర్ వెంట ఆయా పాఠశాలల/ కళాశాలల ప్రిన్సిపల్స్ తో పాటు, దేవరకొండ ఆర్ డి ఓ రమణారెడ్డి, సంబంధిత సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల రీజినల్ కో-ఆర్డినేటర్లు ,తదితరులు ఉన్నారు.

# దొడ్డి కొమురయ్య చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి



భువనగిరి :అమృత్ తెలంగాణ: వీర తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వీర గాధను పాఠ్యాంశాల్లో చేర్చి భవిష్యత్ తరాలకు అందించాలని జి.ఎం.పి.యస్. జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెపురం రాజు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతి సందర్భంగా భువనగిరి జగదేవ్పూర్ చౌరస్తాలో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి జిఎంపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ .. ఆనాడు తెలంగాణ ప్రాంతంలో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నుండి విముక్తి కోసం కుల, మతాలకు అతీతంగా మట్టి మనుషులు సైతం ఆయుధాలు పట్టుకొని సాయుధ పోరాటంలో పాల్గొని ప్రజల కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు కులం తోకలు, మత రంగులు పులిమి తమ రాజకీయ ప్రయోజనాల కోసం పాలకవర్గాలు వాడుకుంటున్నాయని విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన కార్యక్రమానికి సామాజిక ప్రజా సంఘాలు, వృత్తి సంఘాలను పిలవకుండా అవమానించి నామమాత్రంగా నిర్వహించారని ఆరోపించారు. భవిష్యత్తులో జరుగబోయే మహనీయుల జయంతి వర్ధంతి ఉత్సవాలు ప్రతి గ్రామంలో జరిగేలా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేయాలని, జిల్లా కేంద్రంలో ఎకరం భూమి కేటాయించి దొడ్డి కొమురయ్య కాస్య విగ్రహం, విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దయ్యాల నర్సింహ్మా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బుడుమ శ్రీశైలం, మద్దెపురం బాల నర్సింహ్మా, జిల్లా కమిటీ సభ్యులు ర్యాకల శ్రీనివాస్, జెట్ట చిరంజీవి, దేవనూరి బాలయ్య, పాక జహాంగీర్, క్యాసాని నవీన్, పర్వతి దశరథ, అశోక్, ఆంజనేయులు, బుడుమ సురేష్, తోటకూర రవీందర్, ఐతరాజు నాగరాజు పాల్గొన్నారు.

# వర్షాకాలం సీజన్ కనుగునంగా కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలి



భువనగిరి :అమృత్ తెలంగాణ: రానున్న వానాకాలం సీజన్ కొరకు జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు అవసరమైన ప్యాడీ క్లీనర్లు, తార్పాలిన్ల అవసరాన్ని అంచనా వేయాలని, రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రోజు తన ఛాంబర్ లో అధికారులతో మాట్లడుతూ అవసరాలకు అనుగుణంగా స్పెసిఫికేషన్లను ఖరారు చేయడం కొరకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించడం కోసం ఒక జిల్లా కొనుగోలు కమిటీ ఏర్పాటు చేయబడిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కొనుగోలు కమిటీ సభ్యులుగా ఉన్న రెవిన్యూ అదనపు కలెక్టర్ – చైర్మన్ ,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా సహకార అధికారి,జిల్లా వ్యవసాయ అధికారి ,జిల్లా మార్కెటింగ్ అధికారి , జిల్లా మేనేజర్, జిల్లా పౌర సరఫరాల అధికారి జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ కమిటీ ప్యాడీ క్లీనర్లు, తార్పాలిన్లు అవసరమైన పీపీసీలను గుర్తించి, ముందస్తు కొనుగోళ్లు జరిపి రానున్న సీజన్ లో కొనుగోళ్ల ప్రక్రియకు సమాయత్తం చేస్తుందనారు. ఈ కార్యక్రమం లో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి,జిల్లా పౌర సరఫరా అధికారి హరి కృష్ణా,జిల్లా సివిల్ సప్లై అధికారి రోజా రాణి, మార్కెటింగ్ అధికారి సబితా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్ జాబితా సవరణలలో బిఎల్వోలు జాగ్రత్తలు తీసుకోవాలి..



భువనగిరి :అమృత్ తెలంగాణ: ఓటరు జాబితా సవరణలో బీఎల్ ఓలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీవో కృష్ణారెడ్డి అన్నారు. ఓటరు జాబితా సవరణపై భువనగిరిలో బీఎల్ ఓ లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరమే నూతన ఓటరు నమోదు, సవరణ, తొలగింపు, బదిలీ, ఫొటో మార్పిడి తదితర సవరణలను చేపట్టాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నందున బల్కుగా వచ్చే ఫారాలు, ఒకే వ్యక్తి పెద్ద మొత్తంలో ఇచ్చే ఫారాలపట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని అన్నారు. ఈమేరకు ప్రజలకు అవగాహన కల్పించా లని, అర్హులందరూ ఓటరు జాబితాలో చేరేలా చైతన్యపరచాలని అన్నారు. తహ సీల్దార్ అంజిరెడ్డి, రిసోర్స్ పర్సన్స్ నర్సిరెడ్డి, నరేందర్రెడ్డి, చిత్తరంజన్, బిక్షం, సంజీవరెడ్డి , ప్రణయ్ కుమార్, రజనీష్ ప్రసాద్ , బాలరామ్ అవగాహన కల్పించారు.

# రోడ్డు మరమ్మత్తులు చేపట్టడంలో ఎమ్మెల్యే విఫలం..

భువనగిరి :అమృత్ తెలంగాణ: భువనగిరి పట్టణంలోని జగదేవపూర్ రోడ్ లోని బ్రిడ్జి, ఆర్ కె హాస్పిటల్ ముందు రోడ్డుపై గత కొంతకాలంగా గుంతలమయమైంది. ఈ క్రమంలో గత నెల రోజుల క్రింద భువనగిరి శాసనసభ్యులు ఈ రోడ్డును పరిశీలించి, మరమ్మతులు చేపిస్తానని చెప్పి పట్టించుకోవడంలేదని బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో సిమెంటు కంకరతో గుంతలు మూసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కాజా అజముద్దీన్, పార్టీ యువజన విభాగం పట్టణ యూత్ అధ్యక్షులు పెంట నితీష్ లు మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలల కాలం గడుస్తున్నా.. భువనగిరి శాసనసభ్యులకు ఇలాంటి ముఖ్యమైన పనులను చేయడం మానేసి, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో భువనగిరి మాజీ శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి చేసిన పనులకు మళ్లీ కొబ్బరికాయలు కొడుతూ తిరగడమే సరిపోతుందని విమర్శించారు.

# సరస్వతీ పార్క్ శుభ్రం.. కాలనీ వాసుల ఆనందం



జడ్చర్ల: అమృత్ తెలంగాణ: జడ్చర్ల పట్టణంలోని 3వ వార్డులోని సరస్వతి నగర్ పార్క్ గత కొన్ని సంవత్సరాలుగా చెట్లపొదలు, మురుగునీరుతో నిండి ఉంది. అందులో పాములు పందులు విచ్చలవిడిగా ఉండడంతో చుట్టుపక్కల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. దీంతో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ నరేష్ కలిసి జెసిబి సహాయంతో పార్క్, చెట్ల పొదలను తొలగించారు. మురుగునీరు వెళ్ళేందుకు సరైన మార్గాన్ని చేశారు. దీంతో పార్కు మొత్తం శుభ్రంగా తయారయింది. ఇన్ని రోజులు ఎవరూ పట్టించుకోని పార్కును మండల నాయకులు రాఘవేందర్ దగ్గర ఉండి పని చేయించినందుకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం.!



పెద్దవూర :అమృత్ తెలంగాణ: నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గం పెద్దవూర మండలం మండలంలోని పొట్టే వాని తండ గ్రామంలో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. తండాకి చెందిన వికలాంగుడు రమావత్ బిచ్చు అనే రైతుకు చెందిన ఇల్లు కరెంట్ షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా కాలిపోయింది. బిచ్చు కుటుంబ సభ్యులు ఉదయం కూలి పనులకు వెళ్లారు. అకస్మాత్తుగా ఇంట్లో నుంచి మంటలు ఎగసి పడటంతో అది చూసిన చుట్టుపక్కల వారు ఫైర్ సిబ్బంది కి సమాచారం ఇచ్చారు. ఫైర్ ఇంజన్ రాకపోవడం తో గ్రామస్తులు ఎదో విదంగా మంటలను అదుపులోకి తీసుకొని వేరే ఇంటికి మంటలు వ్యాపించ కుండా జాగ్రత్త పడ్డారు. బాధితులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇంట్లో దాచి ఉంచిన బియ్యం, ధాన్యం,ఫ్రిజ్,సామాన్లు కాలి పోయాయి. ఇల్లు అక్క డక్కడ రిపేర్ ఉండడం తో గత రెండు రోజుల క్రితం లక్ష రూపాయలు అప్పుగా తెచ్చి బాగుచేయటకు ఇంట్లో పెట్టుకున్నాడు. ఆ నగదు కూడా మంటల్లో కాలిపోగా సుమారు రూ.07 లక్షలవరకు ఆస్తి నష్టం జరిగిందని, ఈ ప్రమాదంలో ఇల్లు లోపల పూర్తిగా అగ్నికి ఆహుతి అవడంతో ఇంట్లో వస్తువులు మొత్తం కాలిపోయి బాధితులు కట్టుబట్టలతో మిగిలిపోయారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు.

# కేసీఆర్ ను పరామర్శించిన గుంటకండ్ల జగదీష్ రెడ్డి



సూర్యాపేట :అమృత్ తెలంగాణ: సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం గురువారం యశోదా ఆసుపత్రిలో అడ్మిట్ అయిన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును పలువురు పార్టీ నేతలు పరామర్శించారు. శుక్రవారం సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి కేసీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ పార్టీ నాయకులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. రాష్ట్రంలోని పరిస్థితులు, రైతులకు యూరియా ఎరువుల సరఫరా, సాగునీటి ప్రాధాన్యం, వ్యవసాయ సమస్యలు, సమకాలీన రాజకీయ అంశాలపై వారితో విస్తృతంగా చర్చించారు. ఉద్యమకారులు, నాయకుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించి, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై సూచనలు ఇచ్చినట్లు సమాచారం.

# తెలంగాణ తొలి సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య..



భువనగిరి :అమృత్ తెలంగాణ: భూస్వాముల, దొరల అరాచకాల నుంచి విముక్తి కోసం విరచిత పోరాటం చేసిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని బిఆర్ఎస్ జిల్లా నాయకులు, సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం భువనగిరి మండలంలోని తాజ్పూర్ గ్రామంలో తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 79 వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య ఆశయాల కోసం యువత కృషి చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం ఆయన పోరాట స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నిరంతర ప్రజా సేవకుడు “ఎర్రబెల్లి”



రాయపర్తి : అమృత్ తెలంగాణ: నిరంతర ప్రజా సేవకుడు.. నిస్వార్థ నాయకుడు రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అని బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ ఉపాధ్యక్షుడు గూబ అశోక్ అన్నారు. శుక్రవారం ఎర్రబెల్లి దయాకర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో వృద్ధులకు, ప్రయాణికులకు ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. నిస్వార్థ ప్రజా సేవకు నిలువెత్తు నిదర్శనం ఎర్రబెల్లి దయాకర్ రావు అని కొనియాడారు. ఆయన చేసిన అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుంది అన్నారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్క కార్యకర్తను ఆదుకోవడం ఎర్రబెల్లి నైజం అని తెలిపారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, పార్టీ యూత్ నాయకులు చెడుపాక కుమార్, అశ్రఫ్ పాషా, సంకినేని ఎల్లస్వామి, చందు రామ్, చందు సతీష్, మండల శ్రీధర్, సుమన్ యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాసర ఆర్జీయూకేటీలో మీడియాకు కట్టడి

ముధోల్ : బాసర ఆర్జీయూకేటిలో మళ్ళీ మీడియాకు ఆంక్షలు తప్పటం లేదు. సంబంధిత అధికారులు అవలంబిస్తున్న వైఖరి పై జర్నలిస్టులు మండిపడుతున్నారు. పూర్తి వివరాల్లో వెళితే.. బాసర, మహబూబ్ నగర్ ఆర్జీయూకేటిలో విద్యను అభ్యసించడానికి విద్యార్థుల ప్రవేశ జాబితా ను శుక్రవారం బాసర యూనివర్సిటీ లో విసి గోవర్ధన్ విడుదల చేశారు. అయితే ఈ కార్యక్రమానికి జర్నలిస్టు లకు యూనివర్సిటీ నుండి ఆహ్వానం పంపారు. దీంతో జర్నలిస్టులు యూనివర్సిటీ మొయిన్ గేట్ దగ్గర నుండి అనుమతి తీసుకోని క్యాంపస్ లోపల ఉన్న పరిపాలన భవనం వరకు తమ వాహనాల్లో వెళ్తుండగా, యూనివర్సిటీ డిఎస్పీ రాజేష్ తన వాహనంలో అక్కడి వరకు రావటం జర్నలిస్టులకు ఆశ్చర్యానికి గురి చేసింది. యూనివర్సిటీ లో నిత్యం సమస్యలు రాజ్యం మేలుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఉన్న వీసిని మార్చి నూతన విసి గోవర్ధన్ నియమించినప్పటికీ మీడియా పై ఆంక్షలు మాత్రం ఏ మాత్రం తగ్గడం లేదు . విద్యార్థుల ప్రవేశ జాబితా విడుదల చేయడానికి మీడియా అవసరం ఉండటంతో క్యాంపస్ లోపలికి జర్నలిస్టులను అనుమతించారు. అయితే విలేకరుల సమావేశం నిర్వహించే క్యాంపస్ లోపల ఉన్న పరిపాలన భవనం వరకు జర్నలిస్టులను రానిచ్చారు. మిగతా చోట్లకు వెళ్లకుండా భారీ గేట్లను ఏర్పాటు చేశారు. సెక్యూరిటీ సిబ్బంది ని కాపలా ఉంచారు. ఒకపక్క మీడియాను ఆహ్వానించి




అవమానించడంపై జర్నలిస్టులు అసంతృప్తి వ్యక్తం చేశారు. యూనివర్సిటీ లో జరుగుతున్న అవకతవకలు, సమస్యలు బయటకు రాకుండా మీడియాను కట్టడి చేస్తున్నారని పలువురు జర్నలిస్టు లు ఆరోపిస్తున్నారు. ఈ విషయం పై విలేకరుల సమావేశం ముగిసిన తర్వాత యూనివర్సిటీ డిఎస్పీ రాజేష్ ను విలేకరులు ప్రశ్నించగా పేన్నుకు , నొటికి ఆంక్షలు లేవు కదా అని సమాధానంను దాట వేశారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ సహజమే..



జన్నారం :అమృత్ తెలంగాణ: ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణలు సహజమేనని మంచిర్యాల డీఈవో యాదయ్య అన్నారు. దేవుని గూడా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన పిట్ట రాజారావు కు మండల కేంద్రంలోని పిఆర్టియు భవన్లో శుక్రవారం ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు పనిచేస్తున్నప్పుడు చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఉపాధ్యాయ వృత్తి అనేది ఎంతో గొప్పనైనది అన్నారు. పిట్ట రాజారావు శేష జీవితాన్ని సుఖసంతోషాలతో గడపాలని కోరుతున్నామన్నారు కార్యక్రమంలో తాసిల్దార్ రాజ మనోహర్ రెడ్డి ఎంఈఓ విజయ్ కుమార్ ఎస్సై గొల్లపల్లి అనూష, పి ఆర్ టి యు మండల అధ్యక్షుడు కట్ట రాజమౌళి, ఉపాధ్యాయులు కొండ్రు జనార్దన్ జాజాల శ్రీనివాస్, సత్యనారాయణ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జీయూకేటీ విద్యార్థుల ప్రవేశ జాబితా విడుదల

ముధోల్ :అమృత్ తెలంగాణ: బాసర, మహబూబ్ నగనర్లో ఉన్న రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటి) విద్యార్థుల ప్రవేశ జాబితాను బాసర ఆర్జీయూకేటి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేశారు. బాసర ఆర్జీయుకేటి పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యార్థుల ప్రవేశ జాబితాను విడుదల చేసి వివరాలను మీడియాకు వెల్లడించారు. బాసర ఆర్జీయూకేటిలో 1600, సీట్లు, ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు అయిన మహబూబ్‌నగర్‌కు 190 సీట్ల భర్తీ కోసం 20258 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారని వీసీ పేర్కొన్నారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం 1690మంది విద్యార్థులకు మెరిట్ ఆధారంగా సీట్లను కేటాయించడం జరిగిందన్నారు. ఎంపికైన విద్యార్థులు జాబితాను యూనివర్సిటీ వెబ్సైట్లో చూసుకోవాలన్నారు. బాసర, మహబూబ్‌నగర్ ఆర్జీయూకేటిలకు ఎంపికైన విద్యార్థులకు బాసర యూనివర్సిటీలోని ఈనెల 7, 8, 9, తేదీల్లో కౌన్సిలింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థుల మెరిట్ ఆధారంగా వెబ్సైట్లో పేర్కొన్న తేదీల ప్రకారం తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్ కు హాజరు కావాలన్నారు. కౌన్సిలింగ్ కు హాజరుకాని విద్యార్థులు సీట్లు కోల్పోతారన్నారు. ఆ సీట్లను వెయిటింగ్ లో ఉన్న విద్యార్థులకు కేటాయించడం జరుగుతుందని వీసి తెలిపారు. ఆగస్టు 4వ తేదీ నుండి అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ప్రత్యేక కేటగిరీలకు చెందిన 158 సీట్ల కు కౌన్సిలింగ్ వేరుగా ఉంటుందన్నారు. అయితే సెలక్షన్ లిస్ట్ లో ప్రభుత్వ



పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు మాత్రం 24 మార్కులు అదనంగా కలపడం జరిగిందన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు అధికంగా సీట్లు వచ్చాయన్నారు. ఈ విద్య సంవత్సరంలో విద్యార్థులకు ఇబ్బందులకు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగింది అన్నారు. అయితే తెలంగాణలోని 33 జిల్లాలో నిజామాబాద్‌కు 297 సీట్లు అత్యధికంగా రాగ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు 1సీటు మాత్రం మే వచ్చింది. ఎంపికైన విద్యార్థులో బాలికలు 72 శాతం,బాలురు 28 శాతం మంది ఉన్నారు. ఇందులో ప్రభుత్వం పాఠశాల విద్యార్థులు 88శాతం, ప్రకయివేట్ పాఠశాల విద్యార్థులు 12శాతం ఎంపిక అయ్యారు. సమావేశంలో ఓ ఎస్ డి మురళీధర్సన్, కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్, కో కన్వీనర్ డాక్టర్ దేవరాజు, బండి హరికృష్ణ, డాక్టర్ విఠల్ ,బావుసింగ్, పిఆర్ఓ విజయ్ కుమార్ ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య పోరాటం మరువలేనిది..

ముధోల్ : దొడ్డి కొమురయ్య పోరాటం మరువలేనిది..భూమి కోసం, భూక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసంతెలంగాణ రైతంగాం సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పోరాటం మరువలేనిది అని మాజీ ఎంపిటిసి దేవుజీ భూమెష్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ లో కురుమ సంఘం ముధోల్ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య 79 వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కొమరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రజాకార్ల పాలనలో దొరల గడీల పాలన అంతము చేయడానికి తుపాకీ తూటలకు



ఏదురోడ్డి తెలంగాణ సాధనకై అమరుడైన మన వేగుచుక్క దొడ్డి కొమరయ్య అని కొనియాడారు. వారి ఆశయ సాధనకై మనమందరం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెత్రి విట్టల్, ఊరేకర్ సాయన్న, నర్సయి బీరప్ప, శివాజీ, బీరన్న, చిన్న విట్టల్, దేవుబాయ్, సంఘం సభ్యులు, పాల్గొన్నారు.


# వ్యాట్ డేనియల్ లవర్ ఇంతందంగానా?



2021లో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ బ్లాక్ బస్టర్ హిట్ 'భీమ్లా నాయక్'తో టాలీవుడ్ లో అడుగుపెట్టింది సంయుక్త మీనన్. ఇందులో ఆమె రానా దగ్గుబాటి సరసన కథానాయికగా నటించింది. అందానికి అందం నటప్రతిభ ఉన్న నాయికగా పేరు తెచ్చుకుంది. డేనియల్ (రానా) వైఫ్ పాత్రలో డైనమిక్ నటనకు ప్రశంసలు అందుకుంది. 2022లో పృథ్వీరాజ్ 'కడువ'తో బ్లాక్ బస్టర్ ని అందుకుంది. ఇప్పుడు ధనుష్ ద్విభాషా చిత్రం వాతి .. కళ్యాణ్ రామ్ పాన్ ఇండియా మూవీ 'బింబిసార'.. కన్నడలో గాలిపాట 2 చిత్రాల్లో నటిస్తోంది. కెరీర్ పరంగా క్షణం తీరిక లేనంత బిజీ అయిపోయింది సంయుక్త.2016లో పాప్ కార్న్ చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన సంయుక్త సూపర్ హిట్ చిత్రం 'తీవండి'లో తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. 2021లో వెల్లం-అనుమ్ పెన్నుమ్ చిత్రాలతో నెమ్మదిగా నిలదొక్కుకుంది. సంయుక్త కేరళ ఫిల్మ్ క్రిటిక్స్ ఉత్తమ నటి అవార్డును అందుకుంది. భీమ్లా నాయక్ - కడువ లాంటి బ్లాక్ బస్టర్ చిత్రాలు తనని గోల్డెన్ లెగ్ గా మార్చాయనడంలో సందేహం లేదు. సంయుక్తకు వరుస అవకాశాలు వస్తున్నాయి. ఇక ఇదే అదనుగా ఈ బ్యూటీ కూడా సోషల్ మీడియాల్లో వరుస ఫోటోషూట్లతో అదరగొడుతోంది.

# కేతిక రాంగ్ టైమ్ లో అడుగుపెట్టిందా?

కేతిక ఇండస్ట్రీలోకి వచ్చి ఇప్పటికే నాలుగేళ్లవుతుంది. కానీ ఇప్పటివరకు అమ్మడికి సాలిడ్ హిట్ పడింది లేదు. పూరీ జగన్నాథ్ కొడుకు పూరీ ఆకాష్ హీరోగా నటించిన రొమాంటిక్ సినిమాతో హీరోయిన్ గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన కేతిక శర్మ ఆ సినిమా డిజాస్టర్ గా నిలవడంతో పెద్దగా హైప్ తెచ్చుకోలేకపోయింది. కేతిక ఇండస్ట్రీలోకి వచ్చి ఇప్పటికే నాలుగేళ్లవుతుంది. కానీ ఇప్పటివరకు అమ్మడికి సాలిడ్ హిట్ పడింది లేదు. ఇవన్నీ చూస్తుంటే కేతిక ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన టైమ్ కరెక్ట్ కాదనిపిస్తోంది. నాలుగేళ్లుగా సినిమాలు చేస్తున్నప్పటికీ ఒక్కటి కూడా సక్సెస్ ఇవ్వకపోవడమేంటని అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఆఖరికి కేతిక రీసెంట్ గా రాబిన్‌హుడ్ సినిమాలో చేసిన ఐటెమ్ సాంగ్ కూడా ఆమెకు కోరుకున్న సక్సెస్ ను ఇచ్చి, తన కెరీర్ కు బ్రేక్ ఇవ్వలేకపోయింది. రొమాంటిక్ సినిమా తర్వాత కేతిక, నాగశౌర్యతో కలిసి చేసిన లక్ష్య, వైష్ణవ్ తేజ్ తో కలిసి చేసిన రంగ రంగ వైభవంగా కూడా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్లుగా నిలిచాయి. దీంతో తన ఆశలన్నీ ఆమె కెరీర్లోనే నటించిన బిగ్గెస్ట్



ప్రాజెక్ట్ అయిన బ్రో సినిమాపై పెట్టుకుంటే ఆ సినిమా కూడా తన ఆశలపై నీళ్లు చల్లుతూ బాక్సాఫీస్ వద్ద ఫెయిలైంది. బ్రో సినిమా తర్వాత టాలీవుడ్ దర్శకనిర్మాతలు కేతికను పట్టించుకోవడం మానేశారు. హీరోయిన్ గా పాత్రలు తగ్గిపోవడంతో కేతిక రాబిన్‌హుడ్ లో ఐటెమ్ సాంగ్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ఆ సాంగ్ చేసింది. ఆ సాంగ్ లోని కేతిక బోల్డ్ మూవ్స్ సోషల్ మీడియాలో కాంట్రవర్సీ అయినప్పటికీ, ఆ సెన్సేషనల్ సాంగ్ కూడా అమ్మడి కెరీర్ కు ఏ మాత్రం ఉపయోగపడలేకపోయింది.

# ఇస్మార్ట్ బ్యూటీ సినిమా కష్టాలు..!

నన్ను దోచుకుందువటే సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ నభా నటేష్. హీరోయిన్ గా మొదటి సినిమాతోనే మంచి మార్కులు దక్కించుకుంది. సుధీర్ బాబు కు జోడీగా ఆ సినిమా లో నటించిన నభా నటిగా విమర్శకుల ప్రశంసలు దక్కించుకోవడం తో పాటు పెద్దల యొక్క చూపు పడేలా చేసింది. ఆ సినిమా తర్వాత బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లు వచ్చాయి. అనూహ్యంగా నభా నటేష్ యొక్క ప్రతిభ గుర్తించిన డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాద్ ఏకంగా ఇస్మార్ట్ శంకర్ సినిమాలో ఛాన్స్ ఇచ్చాడు. ఆ సినిమా సూపర్ హిట్ అవ్వడం మాత్రమే కాకుండా ఇస్మార్ట్ పోరీగా నభా నటించిన తీరు అందరిని ఆకట్టుకుంది. హీరోయిన్ గా ఆ సినిమా తో కమర్షియల్ హీరోయిన్ గా ఈ అమ్మడు నిలదొక్కు కోవడం ఖాయం అనుకుంటూ ఉండగా అనూహ్యంగా ఈ అమ్మడి కెరీర్ కు కరోనా కష్టం వచ్చి పడింది. వరుసగా సినిమాల్లో ఆఫర్లు వస్తాయని భావిస్తున్న సమయంలో అనూహ్యంగా కరోనా వల్ల మొత్తం సీన్ రివర్స్ అయ్యింది. కాస్త గ్యాప్ రావడంతో ఈ అమ్మడిని జనాలు మాత్రమే కాకుండా సినీ వర్గాల వారు కూడా పక్కన పెట్టేసినట్లుగా ఉన్నారు. అందుకే ఈమధ్య కాలంలో ఈ అమ్మడు కనీసం ఒక్కటి రెండు చిన్నా చితకా ఆఫర్లను కూడా దక్కించుకోలేక పోతుంది అల్లుడు అదుర్స్ మరియు మాస్ట్రో సినిమాల్లో నటించిన ఈ అమ్మడు కమర్షియల్ గా మళ్లీ బ్రేక్ ను దక్కించుకోలేక పోయింది



## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# ఈ లుక్ కోసం 10ఏళ్లు శ్రమించిన సింగర్



ఇటీవలి కాలంలో గాయనీగాయకులు కూడా ఫిట్ నెస్ ఫ్రీక్ లు గా మారుతున్నారు. అందాల కథానాయికలకు ధీటుగా తమదైన గ్లామర్ తో ఓలలాడిస్తున్నారు. హీరోయిన్లతో పోలిస్తే టూ హాట్ గా కనిపించే గాయనీమణులకు కొదవేమీ లేదు. ఇక పాప్ గాయనిగా పాపులరైన నేహాభాసిన్ పరిచయం అవసరం లేదు. జగ్ ఘూమేయా (సుల్తాన్) .. ధుంకీ (మేరే బ్రదర్ కి దుల్హన్).. పర్వా వంటి చార్ట్ బస్టర్ సాంగ్స్ పాడిన గాయనిగా తనకంటూ ఒక బ్రాండ్ ఇమేజ్ ఉంది. బ్యాండ్ మేనేజ్ మెంట్ సమయంలో తన ఫ్యాటీ స్టమక్ ని చూస్తూ చాలా సిగ్గుపడేదానిని అని నేహా ఇప్పుడు మరోసారి గుర్తుచేసుకుంది. అందాన్ని కాపాడుకునేందుకు గాయణీమనులు కూడా చాలా చేయాలి. నిరంతరం జిమ్ యోగా అంటూ పెద్ద షెడ్యూల్ ని క్రమం తప్పకుండా పాటించాలి. అప్పుడు మాత్రమే టోన్డ్ ఫిజిక్ ని మెయింటెయిన్ చేయగలరు. చాలా ఏళ్లుగా శ్రమించి నేహాభాసిన్ తన రూపాన్ని ఇప్పటికి మార్చుకోగలిగింది. మునుపటిలా బాన పొట్టతో కనిపించడం లేదు. పూర్తిగా టోన్డ్ ఫ్లాట్ స్టమక్ తో కనిపిస్తోంది. ఫిట్ బాడీతో గుబులు పుట్టిస్తోంది. ఇక తాజా ఇంటర్వ్యూలో నేహా కొన్ని సంచలన విషయాలను వెల్లడించింది. సరైన ఆకృతిలో నా పొట్ట లేనందున నేను అంతర్జాతీయ పాప్ స్టార్ ని కాలేనని అనుకునేదానిని అంటూ తన నిరాశ గురించి వెల్లడించింది. ఒకప్పుడు నేహా భాసిన్ పొట్టను చూసి వెక్కిరించేవారట. ఆమె కెరీర్ ప్రారంభ దశలో వెక్కిరింతలు.. అనుచిత వ్యాఖ్యల కారణంగా తాను చాలా మారానని తెలిపింది. బొద్దుతనం వల్ల అనారోగ్యం కూడా వెంటాడేదని వెల్లడించింది. ఇప్పుడు అద్భుతమైన రూపంతో ఆరోగ్యంగా ఉన్నందుకు సంతోషంగా ఉంది. అంతేకాదు తన శరీరాన్ని ఇలా మార్చుకోవడానికి లేదా మలుచుకోవడానికి ఏకంగా ఆమెకు ఒక దశాబ్దం పట్టిందట. నేను 2002లో %ఎ×వూ%తో నా కెరీర్ ని ప్రారంభించినప్పుడు ముఖ్యంగా మేనేజ్ మెంట్ లో చాలా బాడీ షేమింగ్ ఎదుర్కొన్నాను. ఆ తరువాత నేను 10 సంవత్సరాలు నా బరువు సమస్యల వల్ల చాలా అనారోగ్యం ఎదుర్కొన్నాను. నా శరీరాన్ని రూపాన్ని అంగీకరించేందుకు నిరంతరం పోరాడాను. నా మనసులో ఇవన్నీ పాతుకుపోయాయి" అని నేహా భాసిన్ చెప్పారు.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- sigidiamruth404@gmail.com